ముమ్మరంగా రబీ వరినాట్లు

- 2 వేల ఎకరాల్లో సాగు
- పొలం పనుల్లో రైతుల నిమగ్నం



వడ్డాది పొలాల్లో నాట్లుకు సిద్ధం చేస్తున్న ఆకు మడులు



విజయరామరాజుపేటలో వేసిన రబీ వరి నాట్లు

బుచ్చెయ్యపేట: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని ఆరుగాలం కష్టించి పండించిన ఖరీఫ్ పంటను ఇంటికి చేర్చుకున్న రైతన్న రబీ సాగు పనుల్లో నిమగ్నమయ్యాడు. ప్రస్తుతంగా వరినాట్లు జోరందుకున్నాయి. ప్రధానంగా మండలంలోని వడ్డాది, విజయరామరాజుపేట, గంటికొర్లాం, మంగళాపురం, కుముదాంపేట, కందిపూడి, బుచ్చెయ్యపేట, ఐయితంపూడి, కరక, చినప్పనపాలెం, దిబ్బిడి తదితర గ్రామాల రైతులు రబీ వరి సాగు చేపట్టారు. పెద్దేరు, కోనాం రిజర్వాయర్ల దిగువన ప్రవహిస్తున్న తాచేరు, బొడ్డేరు, పెద్దేరు ఆయకట్టుతోపాటు వ్యవసాయ మోటార్లు, బావులు ఉన్న రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో రబీ వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తక్కువ సమయంలో పండే స్వల్ప కాలిక ఎర్రమల్లెలు, జయ, 1010 తదితర రకాలకు చెందిన వరినాట్లు వేస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు, సలహాలు పాటిస్తున్నారు. రబీ సాగు చేపట్టే రైతులు ఈ – క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, ప్రభుత్వం అందించే రాయితీలను పొందాలని ఏవో భాస్కరరావు సూచించారు.

పెరిగిన రబీ సాగు

మాడుగుల: చెరుకు సాగు నష్టాలు రావడంతో మండల రైతులు వరి సాగుపై దృష్టి సారించారు. దీంతో గతంలో రబీ వరి సాగు 3 వేల ఎకరాల్లో చేయగా, ప్రస్తుతం 7 వేల ఎకరాలకు పెరిగింది. ఇప్పటికే చెరువులతోపాటు పెద్దేరు, పాల గెడ్డ, తారకరామ జలాశయాల్లో సాగు నీరు పుష్కలంగా ఉండటంతో రబీ పంటకు ఢోకా లేదని దీమా వ్యక్తం చేస్తున్నారు.

గృహసారథులే రథసారథులు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: మన ప్రభుత్వంలో గృహసారథులే రథసారథులని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం రాత్రి కొత్తకోటలో రోలుగుంట మండలానికి చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో ప్రమేయం లేకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వం మన్ననలు పొందుతుందన్నారు. ఇంకా సంక్షేమాలు అందని అర్హులను ఎలా గుర్తించాలి, ప్రజలతో మమేకమై వారితో సత్సంబంధాలు ఎలా మెరుగుపరుచుకోవాలి, తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గత ప్రభుత్వం, మన ప్రభుత్వంలో తారతమ్యం, అభివృద్ధి పనులపై ప్రజలకు అర్థమయే రీతిలో వివరించాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు కోరుకున్నట్టుగానే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, పార్టీ మండల సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, కొమరవోలు ఎంపీటీసీ గొర్లె రామన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి : ఆర్డీవో



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం లబ్ధిదారులను ఆదేశించారు. చెట్టుపల్లి జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. రూఫ్ లెవల్, శ్లాబ్ దశలో ఉన్న ఇళ్లను ఉగాది కల్లా పూర్తి చేసుకోవాలన్నారు. లేఅవుట్‌లో నీరు, విద్యుత్, రహదారి నిర్మాణ సదుపాయాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. హౌసింగ్ ఏఈ నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు

- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



ఇంటింటికీ వెళ్లి నవరత్నాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నెరవేర్చారని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మన్యపురట్లలో ఇంటింటికీ వెళ్లి నవరత్నాలపై వివరించారు. తన దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో 61 గ్రామ సచివాలయాలకు నూతన భవన నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన చేస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. నాలుగు మండలాల్లో జల్ జీవన్ పథకంలో రూ.10 కోట్లతో ఇంటింటికీ కుళాయి పనులు చేస్తున్నామన్నారు. మన్యపురట్లలో గెడ్డ సమస్య పరిష్కారానికి రూ. 9 లక్షలు మంజూరు చేశామన్నారు. గెడ్డకు సిమెంటు లైనింగ్ పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, ముత్తా శివాజీ, రెడ్డి సత్యనారాయణ, సర్పంచ్ టి.తలుపులు, ఎంపీటీసీ ఉల్లంపల్లి జోత్స్న, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, మిరపల వెంకటరమణ, వేమల సూర్యనారాయణ, జి.వి.రెడ్డి, సోమన్నదొర, కాళ్ల సత్యనారాయణ, లోకారపు రాము, పైల శిరీషా, మలపురెడ్డి బాబ్జి, ఎంపీటీసీలు పోలుపర్తి వెంకటరమణ, ఇనపసప్పల పుష్ప, కరక అప్పలరాజు, శివాలయ కమిటీ చైర్మన్ ముత్తా సత్తిబాబు, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తమరాన రాము, ముత్తా మహేష్, వీసం చిట్టిబాబు, అప్పన దివాణం పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది దీనదయాళ్ ఉపాధ్యాయ



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నాతవరం: దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు నేటి తరానికి తెలియాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కోజు విక్రమ్ తెలిపారు. శనివారం నాతవరంలో దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నర్సీపట్నం: పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కాళ్ల సుబ్బారావు దీనదయాళ్ చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధిపై నింతరం ఆలోచన చేసేవారన్నారు. గొప్ప మానవతావాది అన్నారు. యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మల్ల పృథ్వీరాజు, చెవ్వాకుల భాస్కర్, బాబూరావు, సోమలింగం, స్వర్ణ, సత్తిబాబు, చిందాడ నూకేశ్వరరావు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రావికమతం: కొత్తకోటలో రైతులు గట్టా చంద్రయ్య, బుర్రయ్య, నానాజీలకు చెందిన గడ్డివాములు (వరిగడ్డి కుప్పలు) శనివారం దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.80 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు సమాచారం మేరకు రావికమతం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. లేకుంటే మరిన్ని కుప్పలు కాలిపోయేవని రైతులు వాపోయారు.

శ్రీకృష్ణుడు ఆలయం, సాయిబాబా మందిరం ప్రారంభం

ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట: నిండుగొండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శెట్టి రామకృష్ణంనాయుడు తన సొంత నిధులతో శ్రీకృష్ణుడు ఆలయం, సాయిబాబా మందిరాన్ని నిర్మించాడు. వీటిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ ఈ విధమైన ఆలయాలను నిర్మించడం వల్ల గ్రామాల్లో ఆధ్యాత్మిక భావం విరాజిల్లుతుందన్నారు. వీటిని ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణమూర్తి, సర్పంచ్ శెట్టి సంధ్య, కొమరవోలు ఎస్.కొత్తూరు సర్పంచ్ పోతల రాజశేఖర్ పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు



డిపో మేనేజర్ ధీరజ్

నర్సీపట్నం: మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం ధీరజ్ తెలిపారు. ఈ నెల 17 సాయంత్రం నుంచి 19వ తేదీ సాయంత్రం వరకు నర్సీపట్నం డివిజన్ పరిధిలో కల్యాణపులోవ, ధారమట్టం పుణ్యక్షేత్రాలకు 50 బస్సులు నడుపుతున్నామన్నారు. నర్సీపట్నం–కల్యాణపులోవ – 10, కొత్తకోట, కల్యాణపులోవ –10, రావికమతం–కల్యాణపులోవ –10, కొంతలం–కల్యాణపులోవ –3, కశిరెడ్డిపాలెం–కల్యాణపులోవ – 2 బస్సులు, నర్సీపట్నం–ధారమట్టం – 5, గొలుగొండ–ధారమట్టం – 5, కృష్ణదేవి–ధారమట్టం –3, కంఠారం–ధారమట్టం 2 బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి

- వ్యాపారులతో మున్సిపల్ కమిషనర్ కనకారావు



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ కనకారావు

నర్సీపట్నం: పట్టణంలో 70 ఏళ్ల తర్వాత చేపట్టే మెయిన్ రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు పేర్కొన్నారు. శనివారం ఆయన్ను పట్టణ వ్యాపారులు కలిసి వంద అడుగులు కాకుండా 80 అడుగుల వరకే రోడ్డు విస్తరించాలని కోరారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద అడుగుల మేర రోడ్డును విస్తరించాల్సి ఉందని, నిధులు మంజూరైనందున పనులు చేపట్టకపోతే తమను ప్రభుత్వం బాధ్యులను చేస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియ పూర్తయిన వెంటనే అందరికీ నోటీసులు ఇచ్చి పనులు ప్రారంభిస్తామన్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న వారికి టీడీఆర్ బాండ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రోడ్డు విస్తరణకు సంబంధించి మాస్టర్ ప్లాన్ డిజిటల్ స్కీన్ ద్వారా వ్యాపారులకు అవగాహన కల్పించారు.

ఇసుక లారీ సీజ్

- ఒకరి అరెస్టు

చోడవరం రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బి.అప్పలనాయుడు తెలిపారు. శనివారం సాయంత్రం గజపతినగరం వద్ద శారదా నది నుంచి ఏపీ35యూ9247 నంబర్ లారీ ద్వారా ఇసుకను తరలిస్తుండగా సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. దుద్దుపాలెం గ్రామానికి చెందిన కొల్లి గణేష్ (26)ను అదుపులోకి తీసుకుని ఇసుక లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

లోక్ అదాలత్‌లో 1,026 కేసులు పరిష్కారం

నర్సీపట్నం: కక్షిదారులు ఆమోద యోగ్యంతో కేసులు పరిష్కరించుకోవటం ద్వారా ఇరు వర్గాలకు మేలు చేకూరుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1,026 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

ఐక్యతగా రామాలయ నిర్మాణం అభినందనీయం

- గొండుపాలెం కొత్తూరులో డిప్యూటీ సీఎం బూడి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, గ్రామస్తులు

కె.కోటపాడు: గొండుపాలెం కొత్తూరులో ప్రజలంతా ఐక్యతగా రామాలయ నిర్మాణానికి ముందుకు రావడం హర్షణీయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఇక్కడ రామాలయ నిర్మాణానికి శనివారం ఆయన గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీని నిర్మాణానికి తన వంతు సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ బండారు కనకమల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, మాజీ సర్పంచ్ బండారు రామస్వామిపాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మామిడికాయల నాయుడు, దొడ్డి పైడిరాజు(టీచర్), మాజీ వైస్ ఎంపీపీ బండారు మంగపతి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తీర్థం

గొండుపాలెంలో అభయాంజనేయస్వామి తీర్థం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం జిల్లా స్థాయి వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. విజేత, రన్నరప్ జట్లకు నగదు పురస్కారాలు అందించారు.

లోక్ అదాలత్‌లో పరిష్కారమే అంతిమం

- చోడవరం సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ



మాట్లాడుతున్న సీనియర్ జడ్జి అరుణశ్రీ



హాజరైన పోలీస్ సిబ్బంది, కక్షిదారులు

చోడవరం రూరల్: లోక్ అదాలత్‌లో ఉభయ పక్షాలు రాజీ పడితే పైకోర్టులో అప్పీలు చేయడానికి అవకాశం ఉండదని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ స్పష్టం చేశారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ ప్రసంగించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు ఇరువర్గాలు అంగీకారానికి వచ్చి లోక్ అదాలత్‌లో రాజీపడడం మేలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమే అంతిమమని, దీనికి తిరుగులేదని కక్షిదారులకు పిలుపు నిచ్చారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి మాట్లాడుతూ అనవసర పట్టింపులతో కేసులను కొనసాగించుకోవడం ఇరు వర్గాల వారికి కాలయాపన, ఖర్చు వృథా అన్నారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ మాట్లాడుతూ అవకాశం ఉన్నంత మేరకు రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రకాశరావు మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి తమ బార్ సభ్యులు ఇరు వర్గాలను ఒప్పించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్టు తెలిపారు. పోలీసు సిబ్బందితో పాటు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,404 కేసుల పరిష్కారం..

స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారమయ్యాయి. రాజీపడదగ్గ కేసుల్లో సివిల్, క్రిమినల్, కేలండర్, ఇతర కేసులు 1,620 గుర్తించారు. వీటిలో లోక్ అదాలత్ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ 1,462 కేసులను రిఫర్ చేసారు. 1,404 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వీటిలో క్రిమినల్ కేసులు అత్యధికంగా 1,320, ప్రీ లిటిగేషన్ కేసులు 67, సివిల్ కేసులు 17 ఉన్నాయి.

తాగునీటి ఎద్దడి గ్రామాలను గుర్తించండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్



మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: రాబోయే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ సూచించారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులున్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో సమస్యను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల మండల స్థాయి అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అనుసరించి సమావేశం నిర్వహించారు. కొత్త ప్రతిపాదనలను ఏమీ సమావేశంలో తీసుకోలేదని ఎంపీడీవో శచీదేవి తెలిపారు. సూపరింటెండెంట్ మంజువాణి, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగవిజయలక్ష్మి, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, వర్రి రామునాయుడు, నెక్కల గోపి, పల్లా కన్నమ్మ, అధికారులు బైరాగి, ప్రసాద్, అల్లు శ్వేత, వెంకటలక్ష్మి, వసంత పాల్గొన్నారు.

కక్షిదారుల సౌకర్యార్థం బెంచీల వితరణ



దాతలు ఇచ్చిన బెంచీలను ప్రారంభించిన జడ్జీలు

చోడవరం రూరల్: స్థానిక కోర్టుల సముదాయంలో కక్షిదారుల సౌకర్యార్థం కేసుల సమయంలో సేద తీరడానికి వీలుగా వాకర్స్ క్లబ్ సభ్యులు సిమెంట్ బెంచీలను వితరణగా అందజేశారు. శనివారం కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి ప్రారంభించారు. చోడవరం వాకర్స్ క్లబ్ సభ్యులు ఎస్ఎస్ షాపింగ్ మాల్ అధిపతి పి.ఎస్.కె.గుప్తా, దుర్గా విలాస్ యజమాని తుమ్మల కృష్ణారావుల ఆర్థిక సాయంతో సమకూర్చినట్టు క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు తెలిపారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రకాశరావు, న్యాయవాదులు బంటు నళిని, నంబారు నర్సింగరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అశోక్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కమిటీల నియామకం

చోడవరం: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల స్థాయి కమిటీలను శనివారం ఆ పార్టీ ప్రకటించింది. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు మండలానికి ఐదుగురు చొప్పున నియమించింది. చోడవరం మండల కన్వీనర్‌గా సింగంపల్లి శివరామప్రసాద్, కో కన్వీనర్లుగా మొల్లి గోవింద, ఆడారి కోటేశ్వరబాబు, వేపాడ భానుప్రసాద్, ఎస్. వినోద్ కుమార్, బుచ్చెయ్యపేట మండల కమిటీ కన్వీనర్‌గా అయితిరెడ్డి ప్రసాద్, కో కన్వీనర్లుగా కొల్లి దశరథ, బైన గిరిబాబు, వియ్యపు నాగరాజు, అయితి రాము నియమితులయ్యారు. రావికమతం మండల కమిటీ కన్వీనర్‌గా వెల్లంకి శ్రీను, కో కన్వీనర్లుగా అయితిరెడ్డి రామకృష్ణ, పెచ్చేటి మణిరాజు, తలారి రవి, డి. మంజులను నియమించారు. రోలుగుంట మండలానికి కన్వీనర్‌గా ఉలబాల చినబాబు, కో కన్వీనర్లుగా మరిశా శ్రీను, కరన గంగరాజు, తమరాన శ్రీనువాసరావు, దోసపత్ని సాయి నియమితులయ్యారు.

మాడుగుల/రూరల్/కె.కోటపాడు: వైఎస్సార్‌ సీపీ మాడుగుల మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా కోడూరు కొండలరావు (జాంటి), మండల కో కన్వీనర్లుగా పి. జగదీశ్, మదుర్తి ధనాజీ, రెడ్డి అరుణ్‌కుమార్, బాలిబోయిన రవికుమార్ నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ కె.కోటపాడు మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా లంకవానిపాలెం గ్రామానికి చెందిన వర్రి షన్ముఖరావు, మండల కో–కన్వీనర్లుగా చౌడువాడకు చెందిన చల్లా సురేష్, కింతాడకు చెందిన పల్లా రామ్మూర్తి, మర్రివలసకు చెందిన వేపాడ మూర్తి, పైడంపేటకు చెందిన గండి మహేష్ నియమితులయ్యారు.

క్లుప్తంగా

ఏపీపీగా రామునాయుడు



నర్సీపట్నం: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎస్.రామునాయుడును అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెషన్స్ కేసులను ప్రభుత్వం తరఫున వాదిస్తారు. 32 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్న ఆయన ఏపీపీగా బాధ్యతలు చేపట్టారు. సహచర న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెం

బుచ్చెయ్యపేట: మంగళాపురం శివారు కుముదాంపేటలో ఆదివారం నేడు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ దేవత మోదమాంబ తీర్థం సందర్భంగా ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

రావికమతం ఎస్‌ఐగా వెంకటేశ్వరరావు

రావికమతం: స్థానిక ఎస్‌ఐగా వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఉమామహేశ్వరరావును వీఆర్‌కు పంపడంతో సబ్బవరంలో పని చేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

బుచ్చింపేటకు 4 బోర్లు మంజూరు



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రాము

రోలుగుంట: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన నిధుల నుంచి బుచ్చింపేట గ్రామానికి నాలుగు చేతిపంపులు మంజూరు చేశారు. ఈ మేరకు కళ్లాల వద్ద శనివారం సాయంత్రం పార్టీ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఇటంశెట్టి వారి కళ్లాల వద్ద వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు ఉలబాల రాము రిగ్గు పనులు ప్రారంభించారు. గత వారం బుచ్చింపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లగా, నాలుగు బోర్లు మంజూరు చేశారని ఆయన తెలిపారు. ప్రభుత్వ విప్‌కు సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సత్యవతి, రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ధ్వజస్తంభం ఊరేగింపు నేడు

మాడుగుల: స్థానిక గవరవీధి రామాలయంలో మార్చిన 1న ప్రతిష్ఠించనున్న ఏకశిలారాతి ధ్వజస్తంభాన్ని వాహనంపై ఆదివారం ఊరేగించనున్నట్లు రామాలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేది వరకు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. చివరి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, అన్న సమారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జీవాలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు

దేవరాపల్లి: గొర్రెలు, మేకలలో పారుదు వ్యాధి నివారణకు పీపీఆర్ టీకా కార్యక్రమం మండల వ్యాప్తంగా శరవేగంగా కొనసాగుతోంది. దేవరాపల్లి, ఎం. అలమండ, మామిడిపల్లి పశు వైద్యులు ఎస్. అలేఖ్య, కె. మంజుషారాణి, జి. ప్రియాంక పర్యవేక్షణలో నాలుగు నెలలు వయసు దాటిన గొర్రెలు, మేకలకు ఈ టీకాలు వేస్తున్నారు. టీకాలు వేసిన జీవాలకు ట్యాగ్‌లను సైతం వేస్తున్నామన్నారు.

మందులతో కుష్టు వ్యాధి నయం

జిల్లా అధికారి శారదాబాయి



అవగాహన కల్పిస్తున్న శారదాబాయి

రావికమతం: మందులు వాడితే కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని జిల్లా కుష్టు నివారణ అధికారి శారదాబాయి తెలిపారు. శనివారం గొంప వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. పలువురు రోగులను పరీక్షించి మందులు అందించారు. క్రమం తప్పకుండా ఆర్నెల్లపాటు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ప్రభుత్వం మందులు ఉచితంగా అందిస్తుందన్నారు. ఇంటింటికీ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. రావికమతం వైద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.